క్లుప్తంగా

సంక్షేమ పథకాలు అమలు చేయాలి

కాళ్ల: కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల వాగ్దానాన్ని అమలుతో పాటు వెల్ఫేర్ బోర్డు ద్వారా భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని జిల్లా కార్యదర్శి మండా సూరిబాబు డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన కాళ్ళలో సోమవారం సెప్టెంబర్ 15 జరగబోయే లేబర్ కమిషనర్ ఆఫీస్ ముట్టడి పోస్టర్లను భవన నిర్మాణ కార్మికులు విడుదల చేశారు. సంక్షేమ బోర్డు నుంచి 2019 నుంచి 2025 వరకు వెల్ఫేర్ బోర్డు క్లైంలు విడుదల చేయాలన్నారు. 50 సంవత్సరాలు నిండిన భవన నిర్మాణ కార్మికులకు రూ.5వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పొట్టిపోతుల మధుసూదనరావు, మాదాసు గోవిందరాజు, చినిమిల్లి మురళి, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

సచివాలయం తరలింపు తగదు

వీరవాసరం: వీరవాసరం గ్రామ సచివాలయం-2ను వేరే చోటుకు తరలించడం తగదని మండల మాలమహానాడు అధ్యక్షుడు తాడి రాజశేఖర్ డిమాండ్ చేశారు. వీరవాసరం తహసీల్దార్‌కు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నడుస్తున్న సచివాలయం ప్రాంతంలోని ఉంచడం ద్వారా ఆ ప్రాంత వాసులు అందరికీ అనుకూలంగా ఉంటుందన్నారు. వీరవాసరం పెదపేటకు దూరంగా వీరవాసరం గ్రామ సచివాలయం-2ను తరలిస్తామనడం ప్రజలందరికీ ఇబ్బందులు కలగజేయడమేనన్నారు. సంబంధిత శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ప్రస్తుతం ఉన్న చోటనే గ్రామ సచివాలయం-2ను ఉంచాలని, లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించడం జరుగుతుందని హెచ్చరించారు.

ఆధ్యాత్మికతలో యువత సేవలు శుభపరిణామం

కాళ్ల: యువత ఆధ్యాత్మికత కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొవడం శుభపరిణామమని ఆకివీడు డీసీ చైర్మన్ గోకరాజు వెంకట శివరామరాజు అన్నారు. కాళ్ల మండలం సీసలి గ్రామంలో సోమవారం వినాయక మండపం వద్ద ఏర్పాటు చేసిన అఖండ అన్నసమారాధన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తొలుత స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈసందర్భంగా కమిటీ సభ్యులను, యువతను ఆయన అభినందించారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ కట్రెడ్డి శ్రీనివాసరావు, నూకల భోగేంద్రబాబు, ఏఎంసి డైరెక్టర్ వాస్కూరి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రూరల్ బ్యాంక్ మొండి బకాయి రూ.6 కోట్లు

ఆకివీడు: స్థానిక రూరల్ బ్యాంక్‌లో రుణాలు తీసుకుని తిరిగి చెల్లించకుండా ఉన్న సొమ్ము రూ. 6 కోట్లు పైబడి ఉందని బ్యాంక్ త్రిసభ్య కమిటీ చైర్మన్ ముత్యాల రత్నం చెప్పారు. బ్యాంక్ ఆవరణలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రైతు బ్యాంకును రైతుల సేవ కోసం వినియోగిస్తామన్నారు. రుణాలు పొందిన వ్యక్తులు త్వరితగతిని చెల్లించాలని, లేకుంటే వడ్డీ చెల్లించి అప్పు తిరగవేసుకోవాలని సూచించారు. బ్యాంక్‌లో డిపాజిట్లు మరింతగా పెంచుతామన్నారు. బ్యాంక్ గొడౌన్లను అభివృద్ధి చేస్తామని, బ్యాంక్ ఆస్తుల్ని కాపాడుతామని చెప్పారు. సమావేశంలో సభ్యులు మర్రివాడ వెంకట్రావు, ఊడిగ శ్రీనివాస్, కార్యదర్శి తోట బాబి పాల్గొన్నారు.

25 నుంచి నేత్రదాన పక్షోత్సవాలు ప్రారంభం

భీమవరం (ప్రకాశంచౌక్): జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా పి జీఆర్ఎస్ సమావేశ మందిరంలో సోమవారం జాతీయ నేత్రదాన పక్షోత్సవాలపై అవగాహన కరపత్రాలను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ఆగస్టు 25 నుండి సెప్టెంబర్ 8వ తేదీ వరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహించుకోవడం జరుగుతోందన్నారు. నేత్రదానం ఒక గొప్ప దానమన్నారు. నేత్రదానంపై గ్రామ, డివిజన్, జిల్లా స్థాయిలలో ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా వైద్యాధికారి డా. జి.గీతాబాయి, గ్రామ వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సీతారామరాజు భగత్‌సింగ్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

భీమవరం: అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు సేవాకార్యక్రమాలు అభినందనీయని ఎంబీవీకె ట్రస్ట్ చైర్మన్, సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బివి రాఘవులు అన్నారు. సోమవారం విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థుల చదువులకు, కిడ్నీ సమస్యతో బాధపడుతున్న పలువురు రోగులకు ఆర్థిక సహాకరం అందజేశారు. సీపీఎం పార్టీ అనేక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు బి బలరామ్, జెఎన్‌వీ గోపాలన్, వసుధఫౌండేషన్ భీమవరం కో ఆర్డినేటర్ ఇందుకూరి ప్రసాదరాజు, ఉద్దరాజు రామం ట్రస్టు చైర్మన్ మంతెన సీతారామ్, గాతల జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

కనుమరుగవుతున్న తాటిచెట్లు

- పర్యావరణానికి పెనుముప్పు
- విచ్చల విడిగా తాటిచెట్ల నరికివేత
- ఇటుకల బట్టీలకు ఉపయోగిస్తున్న తాటిచెట్లు
- జీవనోపాధి కోల్పోతున్న కల్లుగీత కార్మికులు



తాడిచెట్లను నరికి ఇటుకల బట్టీల వద్ద గుట్టగా పేర్చిన దృశ్యం



అక్కడక్కడా కాలువ గట్లుపై కన్పిస్తున్న తాడిచెట్లు

భీమవరం: వాతావరణంలో కాలుష్య నివారణకు లక్షలాది మంది కల్లుగీత కార్మికుల జీవనోపాధికి ఉపయోగపడుతున్న తాడిచెట్లు కనుమరవుతున్నాయి. ఒకప్పుడు కాలువగట్లు, ఖాళీస్థలాల్లో విపరీతంగా పెంచిన తాటిచెట్లను విచ్చలవిడిగా నరికివేసి నేడు ఇటుకలను కాల్చడానికి ఇటుకల బట్టీలకు వినియోగిస్తున్నారు. ప్రజలకు అనేక విధాలుగా ఉపయోగపడే తాటిచెట్లను నరకడం వల్ల పర్యావరణాకి ముప్పు ఏర్పడడమేగాక కల్లుగీత కార్మికుల జీవనోపాధికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. గ్రామాల్లో భవన నిర్మాణాలు తక్కువగా ఉన్న సమయంలో ఎక్కువమంది ప్రజలు తాటిఆకులతో నిర్మించిన ఇళ్లల్లోనే జీవనం సాగించేవారు. చల్లదనానికి ఎంతో అనువైన తాటిఆకుల పందిళ్లు ఇళ్లముందు దర్శనమిచ్చేయి. తాటిచెట్ల నుంచి కల్లుతీసి కల్లు విక్రయాలే గాకుండా తాటిబెల్లం తయారీ వంటివాటికి ఉపయోగించి అనేకమంది జీవనోపాధిపొందేవారు. తాటిచెట్టుకు సంబంధించిన ఆకులతో చాపలు, వివిధ రకాల బుట్టలు వినియోగించేవారు. అయితే నేడు తాటిచెట్లు కనబడడం అరుదుగా మారింది. రియల్‌ఎస్టేట్ వ్యాపారం పుంజుకోవడంతో ఇటుకలకు గిరాకీ పెరగడంతో జిల్లాలోని అనేక ప్రాంతాల్లో ఇటుకలబట్టీలు వెలవడంతో తాటిచెట్లను నరికి ఇటుకలను కాల్చడానికి వినియోగిస్తున్నారు. దీంతో ఎక్కడా తాటిచెట్టు కన్పించే పరిస్థితి కానరావడం లేదు. వేసవి సమయంలో చేలగట్లు, కాలువ గట్లు, ఇతర ఖాళీ ప్రదేశాల్లో ఉండే తాటి చెట్లను నరికి ఇటుకలబట్టీల వద్ద గుట్టలుగా నిల్వచేసుకుంటున్నారు.

తాటిచెట్ల ఉపయోగాలు.

తాటిచెట్టు ఆక్సిజన్‌ను విడుదల చేసి కార్బన్‌డైఆక్సైడ్‌ను తీసుకుంటుంది. గాలిలోని దూళికణాలను ఒడిసిపట్టి గాలిని శుద్ధి చేస్తోంది. తాటిచెట్లవేర్లు మట్టిని బలంగా పట్టుకుని నేలక్షయాన్ని నివారిస్తుంది.

ప్రకృతిలో జీవవైవిధ్యం తగ్గే ప్రమాదం



తాటిచెట్లు తగ్గడం వల్ల ప్రకృతిలో జీవవైవిధ్యం తగ్గే ప్రమాదముంది. బొరాసిస్‌ఫ్లాబెల్లీఫెర్ అనే శాస్త్రీయ నామం కలిగి తాటిచెట్టు మట్టజాతికి చెందింది. కాలువలు, బోదెలకు ఇరువైపుల తాడిచెట్లను పెంచడం వల్ల మట్టి క్షయాన్ని తగ్గించి గట్లు ధృడంగా ఉండేందుకు దోహదపడతాయి. ఇటీవల తాడిచెట్లను విచ్చలవిడిగా నరికివేయడం వల్ల ప్రకృతిలో జీవవైవిధ్యం తగ్గిపోయే ప్రమాదముంది.

డాక్టర్ కె మల్లిఖార్జున, వృక్షశాస్త్ర అధ్యాపకుడు, డీఎన్నార్ కళాశాల, భీమవరం

గీతకార్మికులు ఉపాధి కోల్పోతున్నారు



తాటిచెట్లను ఇటీవల విచ్చల విడిగా నరికివేయడం వల్ల కల్లుగీత కార్మికులు ఉపాధిని కోల్పోతున్నారు. గీత కార్మికులు ఇప్పటికీ మద్యం బెల్ట్‌షాపులు కారణంగా కల్లు అమ్మకాలు తగ్గి ఇబ్బందులు పడుతుంటే తాటి చెట్లు తగ్గిపోవడం వల్ల కల్లుతీసే అవకాశాన్ని కోల్పోతున్నారు. గతంలో తాటిచెట్లకు ప్రభుత్వం కిస్తీలు కట్టించుకోవడం వల్ల చెట్లను నరికే అవకాశం ఉండేదికాదు. ప్రస్తుతం కిస్తీలు తొలగించడంతో విచ్చలవిడిగా చెట్లను నరుకుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

జుత్తిగ నర్సింహమూర్తి, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాకార్యదర్శి

స్పందనకు 4 ఫిర్యాదులు

ఆకివీడు: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు నాలుగు ఫిర్యాదులు అందినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ మార్కండేయేశ్వరరావు సోమవారం చెప్పారు. స్థానిక చినకాపవరం డ్రైయిన్ గట్టుపై ఆక్రమణల షెడ్లు, వాటికి అక్రమంగా ఇచ్చిన కరెంటు కనెక్షన్లు తొలగించలేదని మోరా రామిరెడ్డి ఫిర్యాదు చేశారన్నారు. ఎంఈఈ శాఖ ఆధ్వర్యంలో స్థానికంగా తనిఖీలు ఎన్ని చేయాలి, చేస్తున్నారు, లేబర్ యాక్టు ఎంత మందికి అమలు అవుతుందని వివరాలు తెలియజేయాలని మరో ఫిర్యాదు చేశారన్నారు. మండలంలో పలు చోట్ల ప్రమాదభరితంగా వాహనాలు నడుపుతున్నారని, వాహనంపై ముగ్గురు, నలుగురు కూర్చుని వేగంగా నడుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని రామిరెడ్డి ఫిర్యాదు చేశారన్నారు. చెరుకుమిల్లి గ్రామంలో సరిహద్దు రైతు చెరువు తవ్విన మట్టిన తన పొలంలో వేస్తున్నారని, ఆక్రమించుకోవాలని చూస్తున్నారని రైతు పెరుమాళ్ల తిరుపతమ్మ ఫిర్యాదు చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణపై కేసులు నమోదు

భీమవరం: భీమవరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని గునుపూడిలో వినాయకచవితి సందర్భంగా ఇరువర్గాల మధ్య జరిగిన కొట్లాటలో కేసు నమోదు చేసినట్లు సోమవారం పోలీసులు తెలిపారు. ఆదివారం వినాయక నిమజ్జనం సందర్భంగా రెండు వర్గాలవారు ఘర్షణ పడ్డారని ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పింఛన్లను సద్వినియోగం చేసుకోవాలి



దుంపగడప గ్రామంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న జాయింట్ కలెక్టర్ రాహూల్ కుమార్ రెడ్డి

ఆకివీడు: పింఛన్ల సొమ్ము రూ. 15 వేలు ప్రతి నెలా వచ్చేదని ప్రస్తుతం నిలిపివేశారని ఇద్దరు దివ్యాంగులు, ముగ్గురు వృద్ధులు, ఒక వితంతువు జాయింట్ కలెక్టర్ జాయింట్ కలెక్టర్ రాహూల్ కుమార్ రెడ్డి వద్ద వాపోయారు. మండలంలోని దుంపగడప గ్రామంలో సోమవారం పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాంగులు, వితంతువుల పింఛన్లు ఎందుకు నిలుపుదల చేశారని ఆయన గ్రామ కార్యదర్శిని ప్రశ్నించారు. అర్హులకు పింఛన్లు నిలుపుదల చేయవద్దని హెచ్చరించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో గౌరవంగా బ్రతకాలనే ఉద్దేశ్యంతో పింఛన్లను ప్రభుత్వం పంపిణీ చేస్తుందని చెప్పారు. పింఛన్ సొమ్మును దుబరా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఒకటవ తేదీన పింఛన్లు ఇంటివద్దకు వచ్చి ఉద్యోగులు అందజేస్తున్నారా లేదా అని పలువుర్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు, ఆర్ఐ వంటపాటి ఆంజనేయులు, సర్పంచ్ ముద్దే విశ్వేశ్వరరావు, ఎంపీడీఓ మార్కండేయేశ్వరరావు, కార్యదర్శి, వీఆర్వో పాల్గొన్నారు.

భీమవరంలో బుద్ధుని విగ్రహం ఏర్పాటుచేయాలి



భీమవరంలో తహసీల్దార్ రాంబాబుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం పట్టణం బైపాస్‌రోడ్‌లోని వై జంక్షన్ వద్ద బుద్ధుని విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ది బుద్ధిష్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ కోన జోసెఫ్ కోరారు. సోమవారం సొసైటీ జిల్లా అధ్యక్షుడు ఈది రవికుమార్ ఆధ్వర్యంలో తహసీల్ద్రార్ రావి రాంబాబుకు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం జోసెఫ్ మాట్లాడుతూ వర్తమాన సమాజానికి గౌతమ బుద్ధిని బోధనలు ఎంతో అవసరమని అటువంటి మహనీయుని విగ్రహాన్ని భీమవరంలో ఏర్పాటు చేయాలని కోరుతున్నామన్నారు. రవికుమార్ మాట్లాడుతూ బైపాస్ రోడ్డులో బుద్ధుని విగ్రహాన్ని నెలకొల్పడానికి అనుమతులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో గాతల సందీప్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ కమలాకర్, ఆధార్ రాజు, కొండేటి లాజరు, అంబేడ్కర్ ఆశయ సాధన కమిటీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ బుంగ ఆదామ్, శివశంకర్, బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

భీమవరం నుంచి కలెక్టరేట్ తరలిస్తే ప్రజాఉద్యమం



భీమవరంలోనే కలెక్టరేట్ ఉండాలని దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో పాదయాత్ర దృశ్యం

భీమవరం: భీమవరం నుంచి కలెక్టరేట్‌ను తరలించాలని చూస్తే దళితసంఘాల ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమం చేపడతామని దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందరకుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని 13వ వార్డులో నిర్వహించిన దళిత ఐక్యవేదిక పట్టణశాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. భీమవరం నుంచి కలెక్టరేట్ తరలిపోతుందనే ప్రచారంతో భీమవరం పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర నిరాసకు గురవుతున్నారని అందరికీ అందుబాటులో ఉండే ప్రాంతంలో గాకుండా వేరే ప్రాంతానికి తరలిస్తే పట్టణ ప్రజలందరినీ కలుపుకుని ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. అనంతరం పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గొల్ల రాజ్‌కుమార్, పట్టెం శుభాకర్, ఎం మునియ్య, కె శ్రీనివాస్, ఎస్ మహేష్, జి కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

కవురు శ్రీనివాస్‌కు అభినందనలు



కవురు శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న దృశ్యం

వీరవాసరం: వైఎస్సార్‌సీపీ శెట్టి బలిజ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎమ్మెల్సీ కవురు శ్రీనివాసును నియమించడంతో సోమవారం భీమవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ చినిమిల్లి వెంకట్రాయుడితో పాటు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అభినందించారు. వైఎస్సార్ సీపీ పురోభివృద్ధికి నిత్యం కృషి చేస్తున్న కవురు శ్రీనివాసును పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వివిధ పదవుల్లో నియమించడం అభినందించదగ్గ విషయమన్నారు. కార్యకర్తలకు, నాయకులకు, అభిమానులకు గౌరవం ఇచ్చి ఉన్నత స్థానాల్లో నిలబెట్టే పార్టీ ఒక్క వైఎస్సార్ సీపీ మాత్రమేనని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చవాకుల సత్యనారాయణ మూర్తి, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి మానుకొండ ప్రదీప్ కుమార్, జిల్లా బూత్ కన్వీనర్ డివిడి ప్రసాద్, మండల బీసీ సెల్ అధ్యక్షుడు కడలి శ్రీరాములు, మండపాక రాంబాబు, వీరవల్లి శ్రీనివాస్, కోడి శ్రీనివాస్, తంగెళ్ల బాబు, మేకా శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

గంగమ్మ ఒడికి గణనాథుడు



వెలంపేటలోని గణనాథుడి ఊరేగింపు సందర్భంగా గణనాథుడుని దర్శించుకున్న పీవీఎల్

ఆకివీడు: విఘ్నాలు తొలగి, విజయాలు చేకూర్చే విధంగా ప్రజలకు దీవెనలందించాలని బొజ్జగణపయ్యను వేడుకున్నారు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పీవీఎల్.నర్సింహరాజు. స్థానిక వెలంపేటలో ఏర్పాటు చేసిన వినాయక చవితి ఉత్సవాలు ముగింపు సందర్భంగా సోమవారం నిమజ్జన ఊరేగింపు కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పట్టణ కమిటీ అధ్యక్షుడు అంబటి రమేష్, కౌన్సిలర్ దొడ్డి జగదీష్ పాల్గొన్నారు.

ఘనంగా నిమజ్జనాలు

ఉండి: వినాకచవితి పండుగను పురస్కరించుకుని గ్రామాల్లో నిమజ్జన కార్యక్రమాలను అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. ఉండి, చెరుకువాడ, యండగండి, మహదేవపట్నం తదితర గ్రామాల్లో సోమవారం నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించారు.

పంటకాలువ తవ్వకం పనులు ప్రారంభం

కాళ్ల: మండలం పెదఅమీరం పరిధిలోని నారాయణకోడు పంటకాలవ తవ్వకం పనులు సోమవారం ప్రారంభించారు. ఉండి డీసీ చైర్మన్ తోట ఫణిబాబు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోరా రామ్మూర్తి తవ్వకం పనులు పరిశీలించి మాట్లాడారు. రైతులను దృష్టిలో ఉంచుకుని నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా సుమారు 2 కిలోమీటర్ల పొడవునా పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

ఉండి ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడు రాజశేఖరరెడ్డి

- నేడు వర్థంతికి ఆకివీడులో ఏర్పాట్లు
- నాయకులతో సమీక్షించిన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్.నర్సింహరాజు



స్థానిక నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి నివాసంలో వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులతో సమీక్షిస్తున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీవీఎల్.నర్సింహరాజు

ఆకివీడు: ప్రతి నాయకుడ్ని, కార్యకర్తను పేరు పెట్టి పిలిచే గొప్ప నాయకుడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్.నర్సిహరాజు అన్నారు. స్థానిక నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి నివాసంలో సోమవారం రాజశేఖర రెడ్డి 16వ వర్థంతి కార్యక్రమంపై ముఖ్య నాయకులు, కార్యకర్తలో చర్చించారు. ఈ సందర్భంగా నర్సింహరాజు మాట్లాడుతూ ఉండి నియోజకవర్గానికి, రాజశేఖరరెడ్డికి అనుబంధం ఉందన్నారు. ఆయన ముఖ్యమంత్రి అయిన తరువాత నియోజకవర్గానికి రెండు పర్యాయాలు రావడమే కాకుండా నియోజకవర్గంలో ఐదేళ్లలో 800 కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారని చెప్పారు. నియోజకవర్గంలో పేదల ఇళ్ల కోసం ఆయన చేసిన సేవలు పేద ప్రజల హృదయాల్లో గూడు కట్టుకున్నాయన్నారు.ఆయన తనయుడు వైఎస్.జగన్ మోహన్ రెడ్డి పేదల సొంత ఇంటి కలను నెరవేర్చారని, సొంత ఇంటిలో పేద ప్రజలు సంతోషంగా జీవిస్తున్నారని నర్సింహరాజు చెప్పారు. ప్రజలకు మంచినీరందించేందుకు రూ.30 కోట్లతో పైప్‌లైన్ విస్తరణ పనులకు ఆయన స్వయంగా ఆకివీడు వచ్చి శంఖుస్థాపన చేశారని చెప్పారు. పైప్‌లైన్ విస్తరణ పనులు వేగంగా జరిగినా తరువాత వచ్చిన ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదన్నారు. నియోజకవర్గంలో విద్యుత్ పనులకు 220 కేవీ సబ్ స్టేషన్, 33 కేవీ సబ్ స్టేషన్లు నిర్మాణం పూర్తి చేశారని నర్సింహరాజు చెప్పారు. ఆరోగ్యశ్రీ, ఫీజురీయంబర్స్‌మెంట్, పంచాయతీల అభివృద్ధి, 108, 104, జలయజ్ఞం, రైతులకు ఉచిత విద్యుత్ వంటి ఎన్నో పథకాల్ని అమలుజేశారని నర్సింహరాజు చెప్పారు. అటువంటి మహనీయుడు రాజశేఖరరెడ్డి ప్రజల హృదయాల్లో చిరస్మరణీయుడని పేర్కొన్నారు.

సీఎం చంద్రబాబువి ఆర్భాటపు ప్రకటనలు



సమావేశంలో మాట్లాడుతున్న భీమవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ చినిమిల్లి వెంకట్రాయుడు

వీరవాసరం: ప్రజల సమస్యలు పరిష్కరించడంలో సీఎం చంద్రబాబువి ఆర్భాటపు ప్రకటనలని భీమవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ చినిమిల్లి వెంకట్రాయుడు పేర్కొన్నారు. వీరవాసరం మండలంలోని తోలేరు, పంజా వేమవరం గ్రామాల్లో సోమవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇష్టానుసారంగా ఎన్నో అబద్ధపు హామీలు, బూటకపు మాటలు చెప్పి అధికారంలోకి కూటమి ప్రభుత్వం రావడం జరిగిందన్నారు. అధికారం చేపట్టి ఏడాదిన్నర కావస్తున్నప్పటికీ ప్రజలకు ఏ ఒక్క హామీని పూర్తి స్థాయిలో నెరవేర్చలేదన్నారు. ఎమ్మెల్సీ, శెట్టిబలిజ విభాగం వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసిన పార్టీ ఒక్క వైఎస్సార్ సీపీ మాత్రమే అని అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలకు ఏ చిన్నపాటి సమస్య వచ్చిన అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. ప్రతి ఒక్కరూ పార్టీ పటిష్టతకు పాటుపడాలన్నారు. నూతనంగా ఎంపికైన తోలేరు, పంజా వేమవరం కమిటీ సభ్యులను అభినందించారు. పంజా వేమవరంలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చవాకుల సత్యనారాయణ మూర్తి, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి మానుకొండ ప్రదీప్‌కుమార్, డివిడి ప్రసాద్, కడలి శ్రీరాములు, మండపాక రాంబాబు, కోడి శ్రీనివాసు, రావూరి నాగరాజు, పంజా సురేష్, మల్లరాజు, మేక శ్రీనివాసు, వీరవల్లి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉండి: ఉండి 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో భాగంగా చేపడుతున్న ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో వెలివర్రు ఫీడర్ పనుల్లో కొత్త బ్రేకర్ ఏర్పాటు కొరకు 2వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు. దీనిలో భాగంగా వెలివర్రు, ఉణుదుర్రు గ్రామాల్లోని వినియోగదారులు, ఆక్వా చెరువుల యజమానులు గమనించి సహకరించాలని ఈఈ కోరారు.

సోలార్‌తో విద్యుత్ పొదుపు

కాళ్ల: రాయితీపై వచ్చే సోలార్ రూఫ్ టాప్‌ని ఇంటిపై నిర్మించుకోవడం వల్ల విద్యుత్‌ని ఆదా చేసుకోవచ్చని ఏపీ డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణంరాజు అన్నారు. కాళ్ళ మండలం పెదఅమీరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం గోడపత్రికలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఈఈ ఎస్. వెంకటేశ్వరరావు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతోనే సంపూర్ణ ఆరోగ్యం



బాడీబిల్డింగ్ పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ అద్నాన్‌నయీం అస్మి

భీమవరం: న్యూ ఆంధ్ర బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 21వ తేదీన మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి షేక్ ఖాసీం చెప్పారు. సోమవారం పోటీలకు సంబంధించిన బ్రోచర్స్‌ను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అద్నాన్ నయీమ్ అస్మి మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో ఆరోగ్య పరిరక్షణ ప్రధానమని, బాడీ బిల్డింగ్ క్రీడ ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. యువత క్రమశిక్షణతో క్రీడల పట్ల శ్రద్ధ కనబర్చడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు. ఖాసీం మాట్లాడుతూ మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీలు భీమవరం పట్టణంలోని బీవీరాజు, వీరమ్మ పార్క్ సమీపంలోని డాక్టర్ అంబేడ్కర్ భవనంలో జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ చైర్మన్ దాసి వరప్రసాద్, అల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు బియ్యం పంపిణీ

భీమవరం: ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆలోచనలు, ఆశయాలను నెరవేర్చడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీలో పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం అల్లం రమేష్ వాణి దంపతుల ఆధ్వర్యంలో పేదలకు బియ్యం బస్తాలను పంపిణీ చేశారు. జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు (చినబాబు) మాట్లాడుతూ పుట్టినరోజు వేడుకలలో అభిమానులు సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్, ఏఎంసీ వైస్ చైర్మన్ బండి రమేష్ కుమార్, అల్లం రమేష్, తదితరులు ఉన్నారు.